క్లుప్తంగా

స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న దృశ్యం

కె.గంగవరం: ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్న స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వారు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని చదువుల్లో రాణించి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. ఎంఈఓ నాగరాజు, సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, హెచ్ఎం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ తరపట్ల ఆనందరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆజాద్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలి



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పిలుపు ఇచ్చారు. ఆజాద్ జయంతి పురస్కరించుకుని హసన్‌బాదలోని అంబేడ్కర్ సమీకృత హాస్టల్ ప్రాంగణంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిద్ధూ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ విద్యార్థులకు ఆజాద్ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సందర్భాన్ని గురించి వివరించారు. చిన్న వయస్సులోనే తమ ప్రాణాలను దేశం కోసం తృణప్రాయంగా త్యజించిన చంద్రశేఖర్ ఆజాద్ వంటి అమర వీరుల స్ఫూర్తిగా సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అబ్బిరెడ్డి శ్రీనివాస్, బీసీ నాయకుడు కదలి రాంపండు, పీడీఎస్‌యూ నాయకులు కరిపోతుల నవీన్, బి.సంతోష్, ప్రేమ్‌కుమార్, బి.జోసెఫ్, కిరణ్‌కుమార్, ఎం.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు



కృత్తివెంటి గ్రౌండ్‌లో మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్న ట్రాక్టర్

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు గడ్డి పెరిగిపోవటంతో క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులను గమనించిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చింతా వెంకటరెడ్డి (బాబులు) సొంత ఖర్చుతో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రోజూ వందలాది మంది క్రీడాకారులు, వాకర్స్ యోగా చేసే వారు వస్తుంటారు. గడ్డి విపరీతంగా పెరిగిపోవటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిచ్చిగడ్డి మొక్కలను తొలగించడంతో వెంకటరెడ్డికి పట్టణ యోగా, వాకర్స్ బృందం, తదితర సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బడ్జెట్‌పై బీజేపీ నేత హర్షం

మండపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రరాష్ట్రానికి వరాల జల్లు కురిపించిందని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీకి నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కోన కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై ఎమ్మెల్యే హర్షం

మండపేట: కేంద్రప్రభుత్వం మన రాష్ట్రానికి నిధులు కేటాయింపుపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి నిధుల వర్షం కురిపించినందుకు ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేకంగా అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల సాయం అందుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.



కోటిపల్లి మత్స్యకార కాలనీలో ఇళ్ల వద్దకు వచ్చి చేరిన నీరు



కోటిపల్లి రేవులోని పంటు ఎక్కే రహదారిలో షాపుల వద్దకు చేరిన వరద



దంగేరు శివారు కొత్తకొంపల వద్ద నీట మునిగిన అరటి, మిర్చి పంటలు

ఉగ్రగోదావరి

- నిలకడగా ఉధృతి
- ఆందోళనలో వరీవాహక ప్రాంత ప్రజలు



కోటిపల్లి ఫెర్రీలోని మర్రిచెట్టు మొదలు వరకు ప్రవహిస్తున్న వరద

కె.గంగవరం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరద చేరుతుంది. వరదనీటిని కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో వరద పెరుగుతుంది. మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గోదావరి పెరుగుతూనే ఉంది. అయితే సాయంత్రం నుంచి గోదావరి కోటిపల్లిలో నిలకడగా ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నీటమునిగిన మత్స్యకార కాలనీ

గ్రామంలోని మాధవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట మూడు వీధులు వరదనీటిలో చిక్కుకున్నాయి. గోదావరి ఒడ్డునే ఉన్న పాకల్లోకి వరదనీరు వచ్చి చేరింది. సుమారు 100 గడ్డి, పెంకుటిళ్లలోకి వరద రావడంతో వారు పక్కనే ఉన్న బంధువుల ఇళ్లలో సర్దుకున్నారు. కొందరు ఆ వరదనీటిలోనే ఇళ్లలోనే ఉండిపోయారు. ప్రతి రోజు గోదావరిలో ఉండే నాటు పడవలు ఇళ్ల ముందుకు వచ్చి చేరాయి.

నీట మునిగిన లంక పంటలు

గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంక భూములోని పంటలన్నీ నీట మునిగాయి. మండలంలోని ముక్తేశ్వరం కాజ్‌వే వద్ద, దంగేరు శివారు పాతకోట, కొత్త కొంపలు వద్ద ఉన్న సుమారు 500 ఎకరాల్లో వేసిన వివిధ పంటలు నీట మునిగాయి. ఈ లంకల్లో కొబ్బరి, అరటి, కంద పంటలతో పాటు మిర్చి, వంగ, బెండ, ఆనబ, చిక్కుడు పలు రకాల కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంటలన్నీ నీట మునగడంతో లంక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి

ఏటా గోదావరి వరద ఉధృతికి నష్టపోవడంతో రావడంతో కుటుంబ పోషణ లేక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకార కాలనీ వాసులు వాపోతున్నారు. గట్టు వెంబడి ఉన్న ఇళ్ల గుమ్మాల వద్దకు వరద వచ్చినా ఇంకా ప్రభుత్వం సాయం అందించడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. బియ్యంతో పాటు నిత్యవసరాలు అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలకడగా వరద నీరు

కపిలేశ్వరపురం: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని అద్దంకివారిలంక, కేదారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంక గ్రామాల శివారు ప్రాంతాల్లో గోదావరి వరదనీరు నిలకడగా ఉంది. ఈ గ్రామాలతోపాటు కపిలేశ్వరపురం, వాకతిప్ప, కోరుమిల్లి, తాతపూడి గ్రామాల్లోని పుష్కర ఘాట్లు ముంపుబారిన పడ్డాయి. తహశీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీఓ కొండలరావు వరద ప్రాంతాలను పర్యవేక్షించారు. కపిలేశ్వరపురం గోదావరి గట్టు బలహీనపడిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. తాత్కాలిక చర్యలకు స్థానిక అధికారులకు సూచించారు. వరద ప్రభావం వీడే వరకూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



కపిలేశ్వరపురంలో బలహీనంగా ఉన్న గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



అంగరలో ముంపుబారిన వరి పొలాలు

అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, నల్లూరు, కాలేరు, టేకి, మాచర తదితర గ్రామాల్లోని వరి పొలాలు ముంపుబారినే కొనసాగుతున్నాయి. వీఆర్వో, కార్యదర్శి, ఇతర సచివాలయ ఉద్యోగులు లంక గ్రామాల్లో విశేష సేవలందించారు. గోదావరి ఎగువన నీటిమట్టం తగ్గుదల ప్రారంభం కావడంతో నేటి నుంచి వరద ఉధృతి తగ్గుతుందని లంక గ్రామాల ప్రజలు, అధికారులు ఆశిస్తున్నారు.

నీట మునిగిన పొలాల పరిశీలన



వెల్లలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం డివిజన్ ఏడీఏ ఏవీఎస్ రంగారావు మంగళవారం మండలంలోని వెల్ల, ఏరుపల్లి గ్రామాల్లో పర్యటించి వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. వర్షపు నీరు పంట పొలాల్లో నిల్వ లేకుండా రైతులు చేపట్టిన చర్యలపై అభినందించారు. రైతులందరూ తప్పనిసరిగా నాటు వేసిన పొలాల్లో ఎకరానికి 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా వేయాలని సూచించారు. అదే విధంగా వరి పూర్తిగా కోలుకున్న తరువాత మాగుడు తెగులు, ఇతర కుళ్లు తెగులు సోకకుండా కార్బండిజం, మాంకోజెబ్ కలిపిన ద్రావణాన్ని లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పైపాటుగా పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఏవో ఎస్.సత్యప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు పి. సత్యనారాయణ, పి.రాహుల్, రైతులు పాల్గొన్నారు.

నేడు సంకటహర చతుర్థి పూజలు

అయినవిల్లి: అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు మంగళవారం ఓ ప్రకటన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారి విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. స్వామికి చతుర్థి పూజలు విశేషంగా నిర్వహించడం వల్ల స్వామి శక్తి, మహిమలు మరింత పెరుగుతాయని నమ్మకమన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతాయని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

మున్సిపల్ ఛైర్‌పర్సన్ దుర్గారాణి



కాలనీ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఛైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఛైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గొల్లపుంత రోడ్డులో నిర్మించిన టిడ్కో కాలనీని కమిషనర్ బొడ్డేపల్లి రాముతో కలిసి ఆమె మంగళవారం పర్యటించారు. ప్రతి బ్లాకు వద్దకు వెళ్లి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలుతాయనే ఉద్దేశంతో కాలనీ మొత్తం జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఇంకా అక్కడక్కడా ఉన్న తుప్పలను, పిచ్చి మొక్కలను కూడా తొలగించి శుభ్రం చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణపై ఛైర్‌పర్సన్ స్థానికులను ఆరా తీశారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. అలాగే నిత్యం మున్సిపల్ కార్యాలయంలో ఉంటున్నానని అత్యవసర పరిస్థితిలో తన కార్యాలయానికి వచ్చి కలవచ్చని తెలిపారు. అనంతరం కాలనీ నుంచి బయలుదేరి 24 వార్డు సంఘం పుంత రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో డంపింగ్ యార్డు సమస్య తీరిందన్నారు. ఇప్పుడున్న డంపింగ్ యార్డుకు చేర్చి భూమిని కొనుగోలు చేశామన్నారు. దాన్ని సద్వినియోగం చేసుకుని రోడ్ల మీదకు చెత్త నిల్వలు రాకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యను ఆదేశించారు. ఛైర్‌పర్సన్ వెంట కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, గ్రంథి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నపల్లి సత్తిబాబు, టిడ్కో సిబ్బంది, మెప్మా, సచివాలయ సిబ్బంది వున్నారు.

సాకారం కానున్న రాజధాని కల

రాయవరం: అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు కేటాయించడంతో రాజధాని కల సాకారమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకిరాంబాబు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లభించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన వ్యక్తులు

మలికిపురం: స్థానిక సత్యజ్యోతి థియేటర్ వద్ద మంగళవారం నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్టు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు తమకు వచ్చిన సమాచారం ఆధారంగా చేసిన ఆకస్మిక దాడిలో వారు పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా వారిలో ఇద్దరు పాలకొల్లు వాసులు గాను, మరో ఇద్దరు మలికిపురం వాసులుగా గుర్తించినట్టు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో తహసీల్దారు అనితకుమారి, వీఆర్వోలు అచ్యుత్, హరి పాల్గొన్నారు.

గాయపరచిన వ్యక్తులపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంకలో గాయపర్చిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి వాసుకుమార్ బ్యారేజీ దగ్గర ఉండగా అదే గ్రామానికి చెందిన రమేష్, చంటి బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చారు. దీంతో వాసుకుమార్ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూరాడ డ్రెయిన్‌లో పూడిక తొలగింపు



ఆర్యావటం కోళ్ల తూము వద్ద కూరాడ డ్రెయిన్‌లో జేసీబీతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

కాజులూరు: కూరాడ డ్రెయిన్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను మంగళవారం అధికారులు తొలగించారు. తుపాను ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి తూడు, గుర్రపుడెక్క కొట్టుకువచ్చి కాకినాడ, కోటిపల్లి రోడ్‌లోని కోళ్ళ తూము వద్ద, గొల్లపాలెం, యానంరోడ్‌లో మొగలిపాలెం వంతెన వద్ద నిలిచిపోయింది. దీంతో స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరద నీరు ముందుకు వెళ్లే మార్గంలేక ఇక్కడ పంట పొలాలను ముంచెత్తుతుంది. రోజుల తరబడి నారుమడులు, నాట్లు వేసిన పొలాలు నీట మునిగి మొక్క చనిపోతుండటంతో స్థానిక నాయకులు పరిస్థితిని అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అధికారులతో వచ్చి జేసీబీ, కూలీల సహాయంతో యుద్ధప్రాతిపదికన డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కను తొలగించారు. కార్యక్రమంలో డ్రెయిన్స్ ఏఈ కె.కీర్తి, ఏవో వి.అశోక్, స్థానిక నాయకులు కోట తాతబ్బాయి, చందాల బాబి, పెంకే అప్పారావు, వల్లపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు



వాకతిప్పలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాల్లో 62 మంది వివారాలను నిపుణులు నవీకరించారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో మండలంలోని అద్దంకివారిలంక, నల్లూరు, వాకతిప్ప గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. అద్దంకివారిలంకలో ముగ్గురుకి నూతన ఆధార్ నమోదు, ముగ్గురికి బయోమెట్రిక్ అప్‌డేట్, 11 మందికి డెమోగ్రాఫిక్ అప్‌డేట్, మొత్తం 17 మంది వివరాలను అప్‌డేట్ చేశారు. నల్లూరులో ముగ్గురికి నూతన ఆధార్ నమోదు, తొమ్మిది మందికి బయోమెట్రిక్ అప్‌డేట్, 12 మందికి డెమోగ్రాఫిక్ అప్‌డేట్ మొత్తం 24 మంది వివరాలను నవీకరించారు. వాకతిప్పలో ఐదుగురుకి నూతన ఆధార్ నమోదు, ఐదుగురికి బయోమెట్రిక్, 11మందికి డెమోగ్రాఫిక్ అప్‌డేట్ మొత్తం 21 మంది వివరాలను అప్‌డేట్ చేశారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు, అల్లక ఫణీంద్ర సేవలందించారు.

బైక్ ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలు



చినలంకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూర్యనారాయణ, రామకృష్ణ

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు చినలంక ప్రధాన రహదారిలో మంగళవారం గుర్తుతెలియని బైక్ ఢీకొని ఇరువురి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచవరానికి చెందిన పితాని సూర్యనారాయణ, అతని సోదరుడు పితాని రామకృష్ణ బైక్‌పై కొత్తపేట నుంచి అంబాజీపేట వైపు వస్తున్నారు. చినలంక వచ్చే సరికి ఎదురుగా గుర్తుతెలియని బైక్ వారిని ఎదురుగా ఢీ కొట్టిందన్నారు. దాంతో సూర్యనారాయణ, రామకృష్ణలకు తీవ్ర గాయాలు కాగా 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి



కేవీ శ్రీనివాస్



బి.నారాయణాచార్యులు



ఎస్ఎస్ఆర్ ప్రసాదరెడ్డి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించింది. మండలంలోని యనమదల పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్, నెలపర్తిపాడు పంచాయతీ కార్యదర్శి బి.నారాయణాచార్యులు, జగన్నాయకులపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ ప్రసాదరెడ్డి గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శి నుంచి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరిని జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంపీడీఓ ఎస్వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సహ పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

కాజులూరు: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులదరికీ అధికారులు న్యాయం చేయాలని బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దూడల శంకర నారాయణయమూర్తి అన్నారు. మంగళవారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చి కుట్టుమెషీన్లను పంపిణీ చేస్తుందన్నారు. మండల గ్రామాల్లో పలువురు లబ్ధిదారులు పథకానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే పలు గ్రామాల్లో మరలా రెండోసారి దరఖాస్తు చేయాలని పత్రాలు తీసుకురమ్మని అధికారులు లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో రెండోసారి దరఖాస్తులు అవసరం లేదని అధికారులు దరఖాస్తుదారుల లిస్టులను ఉన్నతాధికారులకు నివేదించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు.

వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా 'యల్లమెల్లి'

పి.గన్నవరం: ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఆర్.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన యల్లమెల్లి రుక్మాంగధరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన కొత్తపేట మండలం పలివెల ప్రభుత్వ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. కాకినాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయనను రెండోసారి ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన అసోసియేషన్ నాయకులకు, సభ్యులకు రుక్మాంగధరావు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టాన్ని నమోదు చేయండి

- తహసీల్దార్ సురేష్‌కుమార్



తహసీల్దారు సూచనలు పాటిస్తున్న వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది

మండపేట: వారం రోజుల కురిసిన వర్షాలకు జరిగిన పంటల నష్టాన్ని నమోదు చేయాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ కుమార్ మాట్లాడుతూ అధిక వర్షాలకు మండలంలోని 12 గ్రామాలు, టౌన్‌లో నీట మునిగి పాడైన పంటలు వివరాలు సేకరించాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి పంటల నష్టం వివరాలు నమోదు చేయాలన్నారు. అంచనాలు పూర్తయ్యాక నివేదికను కలెక్టరుకు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణుల తరలింపు



అయినవిల్లిలంక వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్ఓ ఎం.దుర్గారావుదొర

అయినవిల్లి: వరద ఉధృతికి లంక గ్రామాల్లో నీరు చేరడంతో అక్కడే నివాసం ఉంటున్న 27 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు డీఎంఅండ్‌హెచ్ఓ ఎం.దుర్గారావు దొర తెలిపారు. మంగళవారం ఆయన ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వరద ప్రభావంతో జిల్లాలోని 11 పీహెచ్‌సీల పరిధిలోని లంక గ్రామాలకు వరద ముంపు ఉందన్నారు. తాను మంగళవారం అయినవిల్లిలంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాల్లంక, గురజాపులంక గ్రామాల్లో పర్యటించానన్నారు. వివిధ పీహెచ్‌సీల పరిధిలో 27 మంది గర్భిణులను గుర్తించి ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. ఈ గ్రామాల్లోని ప్రజలను, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు. ఈ గ్రామాల్లో 62 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 372 మంది వైద్య శిబిరాల వద్ద వరద గ్రామాల్లోని ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. తాగునీరు కలుషితమైనందున కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి ఉన్నారు.

మధ్య లంకలో చిక్కుకున్న ఆవుల తరలింపు



బోటు ద్వారా పశువులను ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

మామిడికుదురు: పెదపట్నంలోని గోదావరి మధ్య లంకలో చిక్కుకున్న ఆవులను మంగళవారం రాత్రి సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. వరద నీరు ముంచెత్తడంతో పశువులు మధ్య లంకలో చిక్కుకున్నాయి. ఉదయం నుంచి వాటిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఇంజిన్ బోట్లు మొరాయించడంతో సాధ్యం కాలేదు. దీంతో ఎట్టకేలకు రాత్రి రెండు బోట్లు వేసుకెళ్లి ఆరు ఆవులను ఒడ్డుకు చేర్చారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ మేరికమ్మ, నగరం ఎస్సై సురేష్ పర్యవేక్షించారు. కాగా మరికొన్ని పశువులు ఇంకా మధ్య లంకలో ఉండిపోయాయని రైతులు వాపోయారు.